క్లుప్తంగా

177 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జానకిరామయ్య

హిరమండలం: మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 177 మంది విద్యార్థులకు సోమవారం కొత్తూరు నేత్ర వైద్యాధికారి ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 9 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్ఎం జె.సరోజినీ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

మహా నైవేద్యం..



108 రకాల ప్రసాదాలో నివేదన

హిరమండలం: హిరమండలంలోని బ్రాహ్మణ వీధిలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం గణనాథుడికి 108 రకాల ప్రసాదాలతో మహా నివేదన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు భరత నాట్యంతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సర్వర్ డౌన్..!



గాంధీనగర్ డిపో వద్ద వేలిముద్ర వేస్తున్న కార్డుదారుడు

నరసన్నపేట: బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా కూటమి ప్రభుత్వం కొద్ది నెలలుగా చేపడుతోంది. ఇప్పటికీ సర్వర్ సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి నెలా మొదటి ఐదు రోజులు సర్వర్ మొరాయిస్తోంది. సోమవారం నరసన్నపేటలో ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 12 గంటల వరకు మండల వ్యాప్తంగా బియ్యం పంపిణీ మందకొడిగా జరిగింది. కేవలం 10 శాతం లోపే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్డుదారులు నిరాశతో వెనుదిరిగారు. నరసన్నపేట పట్టణంలో మరింత ఆలస్యంగా బియ్యం పంపిణీ జరిగింది.

అలరించిన అసిరయ్య జానపదాలు



అసిరయ్యను సత్కరిస్తున్న సూర్యనారాయణ

కొత్తూరు: మండలంలోని గులివిందలపేటలో ప్రముఖ జానపద కళాకారుడు అసిరయ్య సోమవారం ఆలపించిన పాటలు అలరించాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అసిరయ్య జానపద పాటల ప్రదర్శనను సూర్యనారాయణ ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో అసిరయ్య పాడిన జానపదాలు అలరించినందున అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అసిరయ్యను సూర్యనారాయణ, ఉప సర్పంచ్ చింతాడ వెంకటసత్యం, నారాయణరావు, తదితరులు ఘనంగా సత్కరించారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

మెళియాపుట్టి: పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను మండలంలోని చిన్నహంస గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. కోటబొమ్మాళి మండలంలోని నారాయణవలస గ్రామానికి చెందిన ఉర్జాన సింహాచలం కంచిలి నుంచి ఆరు గేదెలను నారాయణవలస సంతలో విక్రయించడానికి తరలిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలోని కొత్తవలస గోశాలకు గేదెలను తరలించామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. గొప్పిలి మీదుగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

3న ఆటల పోటీలు

హిరమండలం: ఈ నెల 3వ తేదీన మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంఈఓ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సెటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, తదితర క్రీడా పోటీలను మండలంలోని కల్లట కార్మిల్ పాఠశాల ఆవరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పుట్టిన తేదీ హెచ్ఎం ద్వారా ధ్రువీకరించిన సర్టిఫికెట్, పాస్ ఫొటోపై గజిటెడ్ సంతకం, ధ్రువపత్రంతోపాటు గుర్తింపు కార్డు ఉండాలన్నారు.

ఎరువుల సరఫరాలో.. కూటమి ప్రభుత్వం విఫలం



మడపాం టోల్ గేట్ వద్ద ధర్మాన కృష్ణదాస్‌ను అడ్డుకున్న పోలీసులు

- శ్రీకాకుళం వెళ్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను, నాయకులను అడ్డుకున్న పోలీసులు
- మడపాం టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన, స్వల్ప ఉద్రిక్తత
- చేతకాని ప్రభుత్వమంటూ మండిపడిన నాయకులు



ధర్మాన కృష్ణదాస్‌తో మాట్లాడుతున్న సీఐ

నరసన్నపేట: జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కోసం పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, వందకు మందికి పైగా నాయకులు కార్లలో వెళ్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద సోమవారం ఉదయం నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దాదాపు 20 నిమిషాలు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆఖరికి ధర్మాన కృష్ణదాస్‌ను మాత్రమే అనుమతించారు. పోలీసుల వైఖరిపై పార్టీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. టోల్‌గేట్ వద్ద ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు నక్క తులసీదాస్, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, సురంగి నర్సింగరావు, బుక్కా లక్ష్మణరావు, కణుసు సీతారాం, కణితి కృష్ణారావు, రాజాపు అప్పన్న, బగ్గు రమణయ్య తదితరులు మాట్లాడుతూ.. ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పంటలకు కావాల్సిన ఎరువు దొరకకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, అయినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని నినాదాలు చేశారు. రైతులను కష్ట పెట్టిన వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ప్రశ్నించే గొంతును నొక్కేయడం సరికాదు..

- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ శ్రేణులు



ఆమదాలవలసలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: సకాలంలో ఎరువులు ఇవ్వకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం రైతన్నల ఆగ్రహానికి గురై నామరూపాలు లేకుండా కొట్టుకుపోవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. సోమవారం శ్రీకాకుళం పట్టణంలోని కలెక్టర్ ఆఫీస్ దగ్గరలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద తలపెట్టిన నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు ఆమదాలవలస నియోజకవర్గం నుంచి బయలుదేరిన చింతాడ రవికుమార్‌ను, పార్టీ శ్రేణులను, రైతులును ఆయన కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. రవికుమార్‌తోపాటు నాయకులు అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. రవికుమార్‌ను జీపులో ఎక్కించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. నిరాకరించడంతో ఘర్షణ ఏర్పండింది. చివరకు రవికుమార్‌ను వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. సకాలంలో రైతులకు ఎరువులు అందించటం కూడా కూటమి ప్రభుత్వానికి చేతకాలేదన్నారు. రైతులకు మద్దతుగా నిరసన తెలియజేస్తుంటే అడ్డుకోవడం అన్యాయమన్నారు. దీనిని రైతులను అణిచివేత ధోరణిగా పరిగణించాలన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ కూడా పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, ఆమదాలవలస పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు బెవరమల్లేశ్వరరావు, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎం.వి.రమణ, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం సంయుక్త కార్యదర్శి దుంపల శ్యామలరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న చింతాడను అడ్డుకుంటున్న పోలీసులు

మా ఊరు పేరు మార్చండి సారూ..

మెళియాపుట్టి: మా ఊరు పేరే మాకు పెద్ద సమస్యగా మారిందని పడ్డ పంచాయతీ పరిధిలోని సానిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులకు, టెక్కలి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణమూర్తికి వినతిపత్రాలు అందించారు. సానిపాలెం పేరు వలన మా గ్రామస్తులకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గ్రామం పేరు చెప్పిన క్రమంలో పలుమార్లు అవమానపడిన సందర్భాలు కూడా ఉన్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లిన యువత అక్కడ గ్రామం పేరు చెప్పాల్సి వస్తే ఇబ్బంది పడుతున్నారన్నారు. మా గ్రామానికి 'రామయ్యపాలెం' అని పేరు మార్చాలని కోరారు.



టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పంచాయతీ ఆస్తులను కాపాడాలి

పాతపట్నం: మండల కేంద్రంలోని పంచాయతీ భవనాన్ని కూల్చివేసి చేపట్టనున్న అన్న క్యాంటిన్ నిర్మాణాన్ని ఆపివేయాలని, పంచాయతీ ఆస్తులను కాపాడాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ ఎస్.ప్రసాదరావుకు, ఎంపీడీఓ పి.చంద్రకుమారికి వినతిపత్రం అందజేశారు. ప్రదీప్ మాట్లాడుతూ పంచాయతీ భవనం, స్థలం పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రజలదని, ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదన్నారు. ఈ స్థలంలో అన్న క్యాంటిన్ నిర్మాణ పనులను అడ్డుకోవాలని పంచాయతీ ఈఓ రామచంద్రరావుకు వార్డు మెంబర్లు వినతిపత్రం అందజేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ స్థలాన్ని కొంత మంది దాతలు గిఫ్ట్‌గా ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.నారాయణమూర్తి, జి.రాము, ఎం.వరదరాజులు, టి.సుధాకర్, ఎస్.కృష్ణారావు, ఎ.కాంతారావు, ఎం.తిరుపతిరావు, జి.రాము, పి.సుందరరావు, పి.తిరుపతిరావు, కె.గోపి, టి.వంశీరెడ్డి, ఎ.శిరీష్, కె.ధర్మారావు, పి.ఫల్గుణరావు పాల్గొన్నారు.



ఎంపీడీఓ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బూర్జ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆమదాలవలస ప్రథమశ్రేణి కోర్టు జడ్జి సౌమ్య తెలిపారు. ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేస్తే అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. 18 ఏళ్ల లోపు వారిని చదువుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. ఆమదావలస బార్ అసోసియేషన్ సభ్యుడు గోవిందరావు, ఏజీపీ త్రినాథరావు, బూర్జ ఎస్ఐ ప్రవల్లిక పాల్గొన్నారు.

అంధకారంలో అండర్ టన్నెల్

ఆమదాలవలస: పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వే అండర్ టన్నెల్‌లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది రోజులుగా లైట్లు పనిచేయకపోవడంతో చీకటిలో ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వర్షం నీరు నిల్వ ఉండడం, మరోవైపు చీకటి కారణంగా నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చీకటిగా ఉన్న అండర్ టన్నెల్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్జ: ఈ నెల 2వ తేదీన మండలంలోని కొల్లివలస సబ్ స్టేషన్ పరిధిలో (33/11 కేవీ) విద్యుత్ నిర్వహణ, చెట్ల కొమ్మలను తొలగించనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం విద్యుత్‌శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొల్లివలస, గుత్తావల్లి, చినలంకాం, కాఖండ్యాం, ఉప్పినివలస, కొరగాం, అన్నంపేట, తోటవాడ, నీలాదేవిపురం, అప్పలపేట, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

మెట్టూరును మండలంగా గుర్తించాలి

కొత్తూరు: మండలంలోని మెట్టూరు పంచాయతీకి అనుకొని ఉన్న గ్రామ పంచాయతీలను కలిపి మెట్టూరు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని మెట్టూరు మండల సాధన కమిటీ సభ్యులు బామిడి రాజు, చుక్కా రాంబాబు, గడ్డవలస కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టూరు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. మండలానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

హిరమండలం: ఈ నెల 2వ తేదీన మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రాలు, గ్రామాల్లోని విగ్రహాలకు నివాళులర్పించడంతోపాటు, పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు, హిరమండలం మండల కేంద్రంలో ఉదయం 11.30 గంటలకు, పాతపట్నం మండల కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు, మెళియాపుట్టి మండల కేంద్రంలో సాయంత్రం 3 గంటలకు, కొత్తూరు మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

అందరూ పాల్గొనాలి..

ఆమదాలవలస: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆమదాలవలసలోని పాలకొండ రోడ్డులో గల ఓవర్ బ్రిడ్జి దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, వివిధ విభాగాలకు చెందిన కార్యవర్గ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, క్యాడర్ అంతా పాల్గొనాలని కోరారు.

నాట్లు ఆలస్యమైతే.. ఆందోళన వద్దు

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు
- ముదిరిన వరి నారుతో ఇబ్బందులు దూరం



పి.కిరణ్‌వాణి, ఏఓ, పాతపట్నం



సరాలిలో వరినారు తీస్తున్న రైతులు

పాతపట్నం: ఈ ఏడాది వర్షం అనుకూలించింది. సాగునీటి వనరులు జలకళను సంతరిస్తున్నాయి. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 78 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇందులో సుమారు 55 వేల ఎకరాల్లో వరి వెదలు వేశారు. 22 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. మిగిలిన చోట్ల నారు సిద్ధమైనప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వెయ్యి ఎకరాల్లో నాట్లు ఆలస్యమయ్యాయి. ఈ క్రమంలో ముందుగానే సిద్ధం చేసుకున్న వరినారు ముదురిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముదిరిన నారు నాటుకునే సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే దిగుబడులు యథాతథంగా వస్తాయని, దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని పాతపట్నం వ్యవసాయాధికారి కిరణ్‌వాణి సూచించారు.

ఇలా చేస్తే మేలు..

- వర్షాధారంగా, సాగునీటి కాలువల ద్వారా నీరు లభ్యతకు అనుగుణంగా ఉన్న భూముల్లో ముదురు వరినారు నాటేటప్పుడు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి.
- ముఖ్యంగా 35 నుంచి 50 రోజుల వయసు గల నారు ఉంటే చదరపు మీటరుకు 44 కుదుళ్లు, 50 నుంచి 65 రోజుల వయసు ఉంటే చదరపు మీటరుకు 66 కుదుళ్లు ఉండేలా నాటాలి.
- ముదిరిన నారును లోతుగా నాటితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అందువల్ల నాట్లు తక్కువ లోతులో వేస్తే పిలకలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ తరహా నారు నాటేటప్పుడు నిర్ణీత విస్తీర్ణంలో కుదుళ్ల సంఖ్యను పెంచి దగ్గర, దగ్గర 4 నుంచి 5 మొక్కలు వంతున వేయాలి.
- సిఫార్సు చేసిన మోతాదు కంటే 25 శాతం పెంచి 3 దఫాలు కాకుండా 2 దఫాలుగా అంటే 70 శాతం ఆఖరి దమ్ములో ఎకరానికి 50 కిలోల డీఏపీ, 35 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, మిగతా 30 శాతం అంటే 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ అంకురం దశలో వాడాలి.
- నత్రజని ఎరువులను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి, 36 నుంచి 48 గంటల తరువాత పలుచగా నీరు పెట్టాలి.
- నారు ఉడిచేందుకు సన్నద్ధం చేసేటప్పుడు నారు కట్టల చివర్లు తుంచి నాటాలి. ఇలా చేయడం వలన నారులో ఉండే కీటకాలను నియంత్రించవచ్చు.
- ముఖ్యంగా కాండం తొలుచు పురుగు ఆకు కొనలపై పెట్టిన గుడ్లు నాశనమవుతాయి.
- నాటిన తరువాత ప్రతీ 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు ఏర్పాటు చేయాలి. దీని వలన పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలను కొంతవరకు అదుపు చేయవచ్చు.
- ఎరువులు, పురుగు, కలుపు మందులను వేయడానికి, పైరు స్థితిగతులను గమనించడానికి ఈ కాలిబాటలు ఉపయోగపడతాయి. ఈ కాలిబాటలు నాటే సమయంలో, నాటిన 5 రోజుల వ్యవధిలో తీసుకోవాలి.
- ముదురు నారు నాటిన 15 రోజుల్లోగా కార్బోఫ్యూరాన్ 3-జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున వేసుకుంటే తొలి దశలో కాండం తొలుచు పురుగును నియంత్రించవచ్చు.



చంగుడిలో వరినారు సిద్ధం చేసుకుంటున్న రైతులు



సరాలిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఏఓపై చర్యలు తీసుకోవాలి

సరుబుజ్జిలి: ప్రజాప్రతినిధులు, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న మండల వ్యవసాయాధికారి మన్మథరావుపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, కొండవలస సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు.ఎరువులు సక్రమంగా రైతులకు అందడంలేదని ప్రశ్నిస్తే.. తనకు సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. రైతు సేవా కేంద్రాల్లో అందించాల్సిన ఎరువులను ప్రైవేట్ వ్యాపారుల షాపుల్లో కూటమి నేతల సమక్షంలో అమ్మకాలు చేసేందుకు ఏఓ పూర్తి సహకారం అందిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగినన్న విషయాన్ని ఏఓ మరచిపోయి అధికార పార్టీ నేతలా వ్యవహరిస్తున్నారన్నారు. ఏఓ వ్యవహారశైలిలో మార్పు రాకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.